# ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం

- కోరుట్ల 'పాంచజన్యం' సభలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి ప్రకటన
- అధికారంలోకి వస్తే ఉచిత కార్పొరేట్ విద్య, వైద్యం
- రైతులకు ప్రత్యేక గౌరవం..
- యువతకు పూచీకత్తు లేని రుణాలు
- నీటి నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫలం

**కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అవినీతి, అన్యాయాన్ని ప్రశ్నించినందుకే నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించారని, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే కొత్త పార్టీని స్థాపించానని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన 'పాంచజన్యం' బహిరంగ సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలో డాక్టర్ రఘున్న చేరడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో కోరుట్ల, మెట్‌పల్లి ప్రజలు ఆయన్ను భారీ మెజారిటీతో అసెంబ్లీకి పంపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



తెలంగాణలో ఉన్న పార్టీలు సక్కగా పనిచేసి ఉంటే కొత్త పార్టీ పెట్టాల్సిన అవసరం వచ్చేది కాదని ఆమె వ్యాఖ్యానించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రజల ఆదాయాలు పెరగడం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు 'పాంచజన్యం' పేరుతో 5 కీలక గ్యారంటీలను ఆమె ప్రకటించారు. ఉచిత విద్య: ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందన్న ఆమె, తమ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి పిల్లలు ఏ ప్రైవేట్ స్కూళ్లలో చదివినా ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు. ఉచిత వైద్యం: ఎంత పెద్ద రోగమైనా, ఎంతటి కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా ఉచితంగానే వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్రంలో అవినీతిని అరికడితే ఇప్పుడున్న బడ్జెట్‌తోనే ఉచిత విద్య, వైద్యం అందించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి: బిజినెస్ ఐడియాలు ఉన్న యువతకు ఎలాంటి బ్యాంక్ గ్యారంటీలు లేకుండా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందించి ప్రోత్సహిస్తామన్నారు. రైతులకు రాజభోగం: రాష్ట్రంలో రుణమాఫీ కాక రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, తమ ప్రభుత్వం రాగానే రైతులకు ప్రత్యేక గౌరవం కల్పిస్తామన్నారు. కలెక్టరేట్, ఎంఆర్ఓ, ఆర్డీఓ ఆఫీసులకు రైతులు వస్తే వారి కోసం 'ప్రత్యేక క్యాబిన్లు' ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.సామాజిక న్యాయం: ఫ్రీ బస్సుల వల్ల మహిళల రద్దీ పెరిగి దివ్యాంగులకు బస్సులు ఆపడం లేదని, వారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సామాజిక న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. "ప్రభుత్వంలో మంచి పనులు జరగాలంటే నిలదీసే పార్టీ కావాలి. ప్రజల పక్షాన నిలబడి కొట్లాడేందుకే తెలంగాణ రక్షణ సేన పుట్టింది." అని కల్వకుంట్ల కవిత, అధినేత్రి, తెలంగాణ రక్షణ సేన తెలిపారు. రాష్ట్రంలో వర్షపాతం 40 శాతం మాత్రమే నమోదవుతుందని వాతావరణ శాఖ 7 నెలల క్రితమే హెచ్చరించినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైందని కవిత ధ్వజమెత్తారు. ఉత్తర తెలంగాణలోని 57 రిజర్వాయర్లలో 418 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం కేవలం 93 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. ఫలితంగా సాగునీరు పక్కన పెడితే తాగడానికి కూడా నీళ్లు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాళేశ్వరం కూలిపోయిందనే సాకుతో రేవంత్ రెడ్డి రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని కవిత మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండానే అన్నారం, సుందిళ్ల నుంచి నీటిని ఎల్లంపల్లికి తరలిస్తే.. అక్కడ నుంచి ఎస్సారెస్పీ, వరద కాలువలు, మల్లన్నసాగర్లను నింపి రైతులకు సాగునీరు అందించవచ్చని సాంకేతిక విశ్లేషణ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెగడపల్లిలో 1,600 ఎకరాలు, కోరుట్ల మండలంలో 1,000 ఎకరాలు, మెట్‌పల్లిలో 1,500 ఎకరాలు ఎండిపోతున్నాయని, కాళేశ్వరం ప్యాకేజీ 22 పనులు నిలిచిపోవడంతో ఇబ్రహీంపట్నంలో 7,500 ఎకరాలు సాగులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గూడెం లిఫ్ట్‌కు చిన్న రిపేర్లు కూడా చేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ముఖ్యమంత్రి ఎదురుదాడికి దిగుతున్నారని, ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడానికి తెలంగాణ రక్షణ సేనను ఆదరించాలని కవిత ప్రజలను వేడుకున్నారు.






# ప్రభుత్వ పాఠశాలల జోలికొస్తే ఖబడ్దార్

- కల్వకుంట్ల కవిత హెచ్చరిక
- రేవంత్ ప్రభుత్వాన్ని ప్రజలు పడగొట్టడం ఖాయం
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 'మేఘా, కేఎంవీ'లకే సగం పనులు..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని, ప్రభుత్వ స్కూళ్ల జోలికొస్తే ప్రజలు ఈ ప్రభుత్వాన్ని పడగొట్టడం ఖాయమని టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. విద్యా కమిషన్ రిపోర్ట్ పేరుతో రాష్ట్రంలో ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకు కుదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని తాము మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మాణాల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. మొత్తం 72 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి గానూ, సగానికి పైగా పనులను 'మేఘా', 'కేఎంవీ' సంస్థలకే కట్టబెట్టారు. టెండర్లలో రింగ్ అయ్యారనేది దీని ద్వారా స్పష్టమవుతోంది. కాంగ్రెస్ ఎంపీకి చెందిన 'వెలుగు' పత్రికలోనే ఈ గోల్‌మాల్‌పై కథనం రావడం గమనార్హం. ప్రభుత్వంపై రూ. 600 కోట్ల అదనపు భారం: సదరు సంస్థలు 5 శాతం ఎక్సెస్ కోట్ చేసినప్పటికీ పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వంపై రూ.600 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. 72 స్కూళ్ల కోసం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్తున్నారు. కానీ ఈ నిర్మాణాలకు కనీసం మూడేళ్లకు పైగా సమయం పడుతుంది. మిగిలిన రెండున్నరేళ్ల కాంగ్రెస్ పదవీ కాలంలో ఇవి పూర్తి కావడం అసాధ్యం. రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో స్కూళ్లను నిర్మిస్తే



విద్యార్థులు అంత దూరం వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఆ బస్సుల కాంట్రాక్టును కూడా మళ్లీ 'మేఘా' సంస్థకే ఇచ్చేందుకు ముందే ప్రణాళికలు వేశారని కవిత ఆరోపించారు. బడ్జెట్ స్కూళ్లకు ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం నిలిపివేసి వాటిని చంపేస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లోని స్కూళ్లను మూసేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని విమర్శించారు. ఎక్కడో దూరంగా స్కూళ్లు పెడితే భద్రతా కారణాల దృష్ట్యా తల్లిదండ్రులు ఆడపిల్లలను పంపరని, దీనివల్ల బాలికల విద్య దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసం గ్రామ సర్పంచ్‌లు పోరాడాలని పిలుపునిచ్చారు. "గుడి ఎంత ముఖ్యమో బడి కూడా అంతే ముఖ్యం. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు ఇవ్వలేదు. పిల్లలకు పెడతామన్న బ్రేక్‌ఫాస్ట్ ఊసే లేదు. స్కూళ్లను కుదిస్తే మరి ఉన్న టీచర్ల పరిస్థితి ఏమిటి? కొత్త రిక్రూట్‌మెంట్లు చేయరా? దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టత ఇవ్వాలి." అని కల్వకుంట్ల కవిత అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పెట్టే గుడ్డుకు ప్రభుత్వం కేవలం రూ. 6 మాత్రమే ఇస్తోందని, కానీ బయట మార్కెట్లో గుడ్డు ధర రూ. 8 ఉందోని కవిత గుర్తుచేశారు. ప్రభుత్వం వారానికి మూడు రోజులు కాకుండా ఐదు రోజుల పాటు గుడ్డు ఇవ్వాలని, దానికి తగ్గట్టుగా నిధులను రూ. 8 కి పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు తెలంగాణ రక్షణ సేన ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని స్పష్టం చేశారు.

# గుండె వైఫల్య రోగులకు అత్యాధునిక చికిత్సలు

- డాక్టర్ ఎమ్.ఎస్. చంద్రమౌళి
- అసాధారణ గుండె స్పందనలను నిర్లక్ష్యం చేయవద్దు

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గుండె వైఫల్యంతో బాధపడే రోగులలో గుండె పనితీరును మెరుగుపరిచేందుకు ప్రస్తుతం అత్యంత అధునాతన, ప్రత్యేక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని ప్రముఖ కార్డియాలజీ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్, హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్.ఎస్. చంద్రమౌళి తెలిపారు. సోమవారం హనుమకొండలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యశోద హాస్పిటల్స్‌లోని కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ విభాగం గుండె స్పందనల్లో వచ్చే అసాధారణ మార్పులను ముందే గుర్తించి, రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు. సమావేశంలో డాక్టర్ చంద్రమౌళి చికిత్సకు సంబంధించిన పలు ఆధునిక అంశాలను వెల్లడించారు, వెంట్రిక్యులర్ టాచీకార్డియా అబ్లేషన్: అత్యాధునిక మ్యాపింగ్ సిస్టమ్ సహాయంతో ప్రాణాపాయ స్థితికి కారణమయ్యే గుండె స్పందనల వ్యాధులకు ఈ ప్రక్రియ ద్వారా ఖచ్చితమైన చికిత్స అందించవచ్చు. కండక్షన్ సిస్టమ్ పేసింగ్: సింగిల్ ఛాంబర్, డ్యూయల్ ఛాంబర్ పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్‌లలో కండక్షన్ సిస్టమ్ పేసింగ్ వంటి సరికొత్త పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. లీడ్‌లెస్ పేస్‌మేకర్: ఎలాంటి




వైర్లు లేకుండా అమర్చే ఈ ఆధునిక పరికరం ఆకస్మిక గుండె మరణాల ప్రమాదాన్ని సమర్థవంతంగా నివారిస్తుంది. గుండె స్పందనల్లో వచ్చే తేడాలను చాలామంది సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తారని, అది ప్రమాదకరమని డాక్టర్ హెచ్చరించారు. "గుండె సమస్య తీవ్రమవడానికి ముందు తల తిరగడం, స్పృహ కోల్పోవడం, గుండె దడ లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి తీవ్రమైన రితం సమస్యలకు సంకేతాలు కావచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఆధునిక ఎలక్ట్రోఫిజియాలజీ చికిత్సల ద్వారా ప్రస్తుతం చాలామంది రోగులు పూర్తి ఆరోగ్యాన్ని తిరిగి పొందుతున్నారని చెప్పారు. యశోద హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ఇటువంటి అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో రోగులకు సేవలు అందిస్తోందని, "గుండె స్పందన సక్రమంగా ఉంటేనే జీవితం సురక్షితం.. ప్రతి గుండె స్పందనను కాపాడటమే మా బాధ్యత" అని డాక్టర్ చంద్రమౌళి స్పష్టం చేశారు.